

పేరు మోగ... చాగల్లు తేగ

ప్రజాశక్తి-చాగల్లు



మండలంలోని తేగలు రుచికి చాలా ప్రసిద్ధి. చాగల్లు, కలవలపల్లి, చిక్కాలపాలెం, చిక్కాల, ఊనగట్ల శివారు అమ్మకుంట నుంచి ఒక్కప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైదరాబాదు ఎగుమతి అయ్యేవని, ప్రస్తుతం గుంటూరు జిల్లాకు ఎగుమతి చేస్తున్నామని వ్యాపారులు తెలిపారు. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ మూడు నెలల్లో తాటికాయలు పాతర వేసే నవంబర్, డిసెంబర్ నాటికి తేగలు తయారవుతాయని చెప్పారు. దీపావళి తర్వాత తేగలు ఎగుమతి చేస్తామని తెలిపారు. ఇక్కడి నేల గరువు (ఎర్రమట్టి) కావడంతో తేగలు రుచిగా ఉంటాయని తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లలో దళారుల హవా

- లక్ష్య సాధనలో యంత్రాంగం విఫలం
- తేమ, తాలు, సాంకేతిక సమస్యలు
- ఆరబెట్టలేక తక్కువ ధరకే విక్రయం



ధాన్యం ఆరబెట్టుకుంటున్న రైతులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాలో ధాన్యం కొనుగోలులో దళారులదే పైచేయిగా నిలిచింది. రాష్ట్ర ప్రభుత్వం నూతన సాంకేతిక విధానం అమల్లోకి తెచ్చామని, వరిని పూర్తి స్థాయిలో కొనుగోలు చేస్తామంటూ చేసిన ప్రకటనలు ఆచరణలో నీటి మీద రాతలుగా మిగిలాయి. అన్నదాత ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకునేందుకు ప్రతి ఏడాదిలానే ఈ ఏడాది ఇబ్బందులు తప్పలేదు. ఆర్‌బికె కేంద్రాల్లో నెలకొన్న సాంకేతిక సమస్యలతో పాటు తేమ, తాలు సమస్యలు ఉక్కిరిబిక్కిరి చేశాయి. హమాలీలు, లారీల కొరత వంటి బాధలు పడలేక అత్యధిక మంది రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్మే బదులు వ్యాపారులకు అమ్ముకోవడమే మేలని క్వింటాలుకు రూ.300 నుంచి రూ.400 ధర తక్కువైనా ప్రైవేట్ వారికే అమ్ముకుంటున్నారు. ఒకవైపు మంచు, మరోవైపు వానలతో ధాన్యం ఆరబెట్టుకునేందుకు సౌకర్యాలు లేకపోవటంతో పొలం వద్దే కళ్లాల్లో పచ్చి వడ్లను కొనుగోలు చేస్తున్న దళారులు అత్యధిక ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది.

లక్ష్య సాధనలో ప్రభుత్వ యంత్రాంగం వెనుకబాటు

తూర్పు గోదావరి జిల్లాలో 1.84 లక్షల ఎకరాల్లో వరిసాగు జరిగింది. 4.53 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వచ్చిందని అధికారులు అంచనా వేశారు. ధాన్యం కొనుగోలు కోసం 239 రైతు భరోసా కేంద్రాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. 2.85 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని లక్ష్యం తీసుకున్నారు. ఇప్పటి వరకూ 1.81 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేశారు. అధికారుల గణాంకాల ప్రకారం జిల్లాలో 95 శాతానికి పైగా కోతలు పూర్తయ్యాయి. 4.53 లక్షల దిగుబడిలో 2.20 లక్షల పైబడిన ధాన్యం దళారులు కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. ప్రతి ఏటా క్షేత్రస్థాయిలో ఎదురౌతున్న సమస్యలను గుర్తించి ముందస్తు జాగ్రత్తలు తీసుకోలేదు. జిల్లాలో కోటి సంచుల అవసరం కాగా కేవలం 35 లక్షలు మాత్రమే అందుబాటులో ఉంచారు. సకాలంలో అత్యంత కీలకమైన గోనె సంచులు, రవాణా, ధాన్యం ఆరబెట్టుకునేందుకు సౌకర్యాలు కల్పించడంలోనూ చిత్తశుద్ధి కరవయ్యింది. ఫలితంగా ధాన్యం సేకరణలో ఫలితాలు తలకిందులయ్యాయి. మరో వైపు రైతుల కష్టం దళారుల పాలైందని తెలుస్తోంది.

సాంకేతిక సమస్యలతో సతమతం

కొనుగోలు కేంద్రాల్లో తేమశాతం 17 మించకూడదు. చెత్త, తాలు, మట్టిపెడ్డలు, రాళ్లు ఒక్కశాతం, చెడిపోయిన రంగుమారిన మొలకెత్తిన, పురుగు తిన్న ధాన్యం 5 శాతం, పూర్తిగా తయారు కాని, ముడుచుకుపోయిన ధాన్యం 3 శాతం, తక్కువ రకాల మిశ్రమం 6 శాతం నాణ్యత ఉండాలి. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర క్వింటాకు గ్రేడ్-ఎ రకం రూ.2,060, సాధారణ రకానికి రూ.2,040 దక్కాలంటే.. రైతులు తమ ధాన్యాన్ని ప్రమాణాలకు అనుగుణంగా శుభ్రం చేసి, ఎండబెట్టి తీసుకురావాలి. నేలమీద టార్పాలిన్, ప్లాస్టిక్ సంచులు వేసుకొని పంట ఆరబెట్టాలి. నూర్పిళ్లలో రాళ్లు, మట్టి పెడ్డలు, చెత్త వంటివి లేకుండా చూసుకోవాలి. తేమ, నాణ్యత ప్రమాణాల్లో తేడా ఉంటే... తిరిగి వెనక్కి పంపించేస్తున్నారు. కొన్ని సార్లు ఆర్‌బికె కేంద్రాల్లో వచ్చిన శాతానికి, రైస్ మిల్లులో చూపించిన శాతానికి వ్యత్యాసం ఉంటుంది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు వడ్లు తీసుకెళ్లిన రైతులు వారం రోజుల పాటు వేచి చూడాల్సి వచ్చింది.

పోడు భూములు పంచాలని మహిళల ధర్నా

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

జిల్లాలోని నల్లజర్ల మండలం పోతిరెడ్డి గ్రామంలో కొండ పోరంబోకు పోడు భూములను నిరుపేద దళిత కుటుంబాలకు పంచాలని సిపిఎం జిల్లా నాయకులు జువ్వల రాంబాబు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద పార్టీ ఆధ్వర్యంలో పోతిరెడ్డి గ్రామ దళిత మహిళలు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో రాంబాబు మాట్లాడుతూ గ్రామంలో సుమారు 200 ఎకరాల ప్రభుత్వ కొండ పోరంబోకు పోడు భూములను పెత్తందారీ భూస్వాములు రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై పట్టాలు సృష్టించుకున్నారన్నారు. మొదట్లో రెండు ఎకరాలు ఉన్న ఒక రైతు ఈరోజు 30 ఎకరాలను ఆక్రమించుకున్నారని తెలిపారు. తక్షణమే భూములను సమగ్ర సర్వే చేసి భూస్వాములు ఆక్రమించుకున్న భూముల్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని గ్రామంలో దళిత కుటుంబాలకు పంచాలని డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా నాయకులు బి.పవన్ మాట్లాడుతూ గ్రామంలో ప్రభుత్వ భూముల్ని ఆక్రమించుకున్న భూస్వాములకు వ్యతిరేకంగా పార్టీ పోరాడు తోందని, గ్రామంలో దళితులందరు ఐక్యంగా పోరాడాలని పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భూ పోరాట సాధన కమిటీ సభ్యులు మరియమ్మ, చేబత్తుల వెంకట నర్సమ్మ, పలువురు మహిళలు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న మహిళలు, నాయకులు

నన్నయ వర్శిటీకి నిధులు విడుదల చేయాలి

ప్రజాశక్తి-రాజానగరం

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు దగ్గు అశోక్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం యూనివర్సిటీలో నిజి.నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో విశ్వవిద్యాలయంలో అనేక భవనాలు నిర్మాణం మధ్యలోనే ఉండి పోయాయన్నారు. ఫలితంగా పీజీ విద్యార్థులు ఒక పూట మాత్రమే చదువుకోవాల్సి వస్తుందని వివరించారు. యూనివర్సిటీకి రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడంతో విశ్వవిద్యాలయం అభివృద్ధికి నోచుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నన్నయ యూనివర్సిటీ అభివద్ధికి నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ ముఖ్య నాయకులు గంగిరెడ్డి లక్ష్మి, ప్రవళిక, బి.లిఖిత, యు.విక్రమ్ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎస్ఎఫ్ఐ నేతలు

హౌసింగ్ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-పెరవలి

హౌసింగ్ కార్యాలయ నూతన భవనాన్ని సోమవారం ఎంపిపి కె.సీతారామ్ ప్రసాద్ ప్రారంభించారు. ఎంతోకాలంగా శిథిలావస్థకు చేరిన భవనంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది నూతన భావనం నుంచి కార్యక్రమాలు నిర్వహిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు వీరమల్లు సత్యనారాయణ, పంపన అంజి, సన్నీ, హౌసింగ్ ఎఇ ఎలిపే వెంకన్నబాబు, వర్క్ ఇన్‌స్పెక్టర్ జోగారావు, కంప్యూటర్ ఆపరేటర్ రఘు తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరులో నేడు, రేపు వైద్య శిబిరాలు

ప్రజాశక్తి-కొవ్వూరు రూరల్

కొవ్వూరులోని సుందర సాయి నిగమాగమ కళ్యాణ మండపంలో డిసెంబర్ మంగళ, బుధవారాలు ఉచిత మెగా వైద్య శిబిరం, కంటి పరీక్షల శిబిరం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర హోమ్ శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 21న ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని వైద్య శిబిరాలు, రక్త దాన శిబిరం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తారని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి తానేటి వనిత కోరారు.

సిఐటియు మహాసభ కరపత్రాల ఆవిష్కరణ

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం

సిఐటియు జిల్లా మహాసభ కరపత్రాలను సోమవారం ప్రయివేటు హాస్పిటల్స్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఆవిష్కరించారు. సిఐటియు నాయకులు బి.పూర్ణిమరాజు హాజరై మాట్లాడారు. సిఐటియు జిల్లా మహాసభ ఈ నెల 22, 23 తేదీల్లో జరుగుతుందని తెలిపారు. దీన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రయివేట్ హాస్పిటల్స్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు అర్జున్, కార్యదర్శి ఎం.శ్రీనివాస్, మోహన్ పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

2,054 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

తూర్పు గోదావరి జిల్లాలో రైతుల నుంచి సోమవారం 2054.520 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్లు జెసి ఎన్.తేజ్ భరత్ తెలిపారు. ఇప్పటివరకు 34,299 మంది రైతుల నుంచి 1,91,268.520 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్లు తెలిపారు. రైతులు తమ ధాన్యాన్ని 17 శాతం తేమ వరకు ఆరబెట్టుకోవాలని, వారి ధాన్యాన్ని విక్రయించడానికి తేదీ, సమయాన్ని షెడ్యూల్ చేయడం ద్వారా ఆర్‌బికె సిబ్బంది అవసరమైన గన్నీలు, రవాణా అవసరాన్ని ముందుగానే అంచనా వేస్తామని చెప్పారు. ఇప్పటివరకు రైతుల ఖాతాల్లోకి రూ.109.11 కోట్ల ధాన్యం సొమ్మును జమ చేసినట్టు చెప్పారు. ఏవైనా సందేహాలుంటే అధికారులను సంప్రదించాలని చెప్పారు. కంట్రోల్ రూమ్ నెంబర్లు 8309487151, 08832940788 నెంబర్లకు ఉదయం 8.00 నుంచి రాత్రి 8.00 గంటల్లోపు సంప్రదించవచ్చన్నారు.

నేడు మహిళలకు మినీ జాబ్ మేళా

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

కందుకూరి రాజ్యలక్ష్మి మహిళా డిగ్రీ కళాశాల ప్రాంగణంలో మంగళవారం మహిళలకు మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి కల్పన అధికారి కె.హరీష్ చంద్రప్రసాద్ తెలిపారు. ఎపి నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సిడాప్ ఆధ్వర్యంలో మహిళా నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ప్రత్యేక జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు చంద్రప్రసాద్ తెలిపారు. వివిధ కంపెనీల్లో ఉద్యోగాల్లో పని చేసేందుకు పాలిటెక్నిక్, ఐటిఐ, బిఎస్‌సి, పదో తరగతి, ఇంటర్ పూర్తి చేసిన 19 నుంచి 29 ఏళ్ల వయస్సు వారు అర్హులన్నారు. ఆసక్తి, తగిన అర్హతలు కలిగిన అభ్యర్థులు ముందుగా తమ పూర్తి వివరాలతో https://tinyurl.com/skrgdcw వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకుని విద్యార్హతల బయో డేటా, ఆధార్, పాన్, ఇతర సర్టిఫికెట్ల జిరాక్సు కాపీలతో మంగళవారం ఉదయం 9 గంటలకు రాజమహేంద్రవరంలోని ఎస్ఆర్‌కె ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వద్దకు రావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 891986419, 9666472877 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-గోపాలపురం

ఆపదలో ఉన్నవారికి సాయం చేసేందుకు రక్షణ సేవా సమితి నిరంతరం కృషి చేస్తుందని రక్షణ సేవా సమితి సభ్యులు అన్నారు. సోమవారం పెద్దగూడెం గ్రామానికి చెందిన దిర్సిపోం దావీదు ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఆయన రెండో కుమారుడు మానసిక వికలాంగుడు. దీంతో వారికి రూ.5 వేల నగదు అందజేశారు. పలువురు దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సహాయం అందించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రక్షణ సేవా సమితి అధ్యక్షులు గెల్లా ఎలీషా, కార్యదర్శి తాడేపల్లి యేసురాజు, కార్యవర్గ సభ్యులు దాసరి రామారావు, సిహెచ్.రాజ్‌పాల్, జాషువా తదితరులు పాల్గొన్నారు.

నేడు 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'

ప్రజాశక్తి-గోపాలపురం

నేడు మండలంలోని కరగపాడు, కొవ్వూరుపాడులో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం చేపట్టినట్టు టిడిపి మండల అధ్యక్షులు రొంగల సత్యనారాయణ సోమవారం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం నిర్వహించే ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మద్దిపాటి వెంకటరాజు పాల్గొంటారని, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వైటిసి భవనంలో డిపిఒ కార్యాలయం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

జిల్లా పంచాయతీ కార్యాలయాన్ని స్థానిక వైటిసి భవనంలో ఏర్పాటు చేస్తున్నట్టు డిపిఒ పి.జగదాంబ తెలిపారు. సోమవారం వైటిసి ఆవరణలో డిపివో నూతన కార్యాలయాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఇప్పటి వరకు నగరంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి విధులు నిర్వర్తించామని, సోమవారం నుంచి వైటిసి భవనంలోని జిల్లా ప్రధాన కార్యాలయం నుంచి ప్రజలకు పూర్తి స్థాయిలో సేవలు అందుబాటులోకి తీసుకుని వస్తామని జరుగుంతుందని జగదాంబ తెలియచేశారు. బొమ్మూరులోని రూరల్ తహశీల్దార్ కార్యాలయం ప్రక్కన ఉన్న యూత్ ట్రైనింగ్ సెంటర్ (వైటిసి) భవనంలో జిల్లా పంచాయతీ కార్యాలయం ఏర్పాటు చేసిన దృష్ట్యా ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. తొలుత డిపివో ఛాంబర్‌ను, తదుపరి కార్యాలయ సిబ్బంది గదులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు జిల్లా అధికారులు, పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ హాజరు తప్పనిసరి

ప్రజాశక్తి-కడియం

గ్రామ సచివాలయాల్లో పని చేసే ఉద్యోగులందరూ ఉదయం 10:30 గంటల్లోపు ఆన్ లైన్‌లో హాజరు వేయాలని కడియం ఎంపిడిఒ కె.రత్నకుమారి ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సచివాలయ ఉద్యోగులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు సమయానికి హాజరు వేయాలన్నారు. ఈ హాజరుకు సంబంధించి ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పరిశీలించి సమీక్షిస్తున్నారన్నారు. విఆర్ఒలు, సర్వేయర్లకు ఎలాంటి మినహాయింపు లేదన్నారు. హాజరు వేసిన తర్వాతే ఫీల్డ్ వర్క్ ఉంటే బయటకు వెళ్లాలని సూచించారు. సచివాలయాల్లో సేవలు కూడా మరింత పెంచాలన్నారు. జేగురుపాడు, వేమగిరి గ్రామాలను మోడల్ విలేజ్‌లుగా ప్రభుత్వం గుర్తించిందని, ఆ గ్రామాల్లో ఇంటింట చెత్త సేకరణ, గ్రామాల పరిశుభ్రతకు కృషి చేయాలని తెలిపారు. గడప గడపకూ ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. ఈ సమావేశంలో మండల పరిషత్ ఎఒ కె.చంద్రరావు, ఇఒపిఆర్‌డి వైవిఎన్ఎస్.లక్ష్మి, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

20 నుంచి ప్రభుత్వ సిబ్బందికి వర్క్‌షాప్‌లు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

మెరుగైన పౌర సేవలు, శాఖాపరమైన విధుల నిర్వర్తించే సామర్థ్యంపై మూడు రోజుల పాటు ప్రభుత్వ సిబ్బందికి వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నట్టు జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ స్పందన హాల్లో సుపరిపాలన (గుడ్ గవర్నెన్స్)పై అధికారులకు జెసి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 20న విద్యాశాఖ, 21న వైద్య ఆరోగ్యశాఖ, 22న గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా అందిస్తున్న సేవలు, స్పందన ప్రజా సమస్యల సత్వర పరిష్కారంపై శాఖాపరమైన అధికారులతో ఈ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రతిష్టాత్మకంగా చెప్పట్టిన సంక్షేమ అభివృద్ధి పథకాలు, కార్యక్రమాల ద్వారా సుపరిపాలన అందజేతకు సమీక్ష నిర్వహిస్తారన్నారు. తద్వారా ప్రజా సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకు, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పౌర సేవలను మెరుగు పరచడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.జిల్లాలో ఆయా మండలాలు ఏ స్థాయిలో ఆయా పథకాల ప్రయోజనాలను ప్రజలకు అందజేస్తున్నదీ నివేదికలు సిద్ధం చెయ్యాలన్నారు. డిసెంబర్ 23న మూడు రోజులపాటు వర్క్ షాప్‌లో చర్చించిన ఆయా అంశాలపై కలెక్టర్ సమీక్షిస్తారని తెలిపారు.

క్షేత్రస్థాయిలో స్పందన అర్జీల పరిష్కారం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ప్రజా పరిష్కార వేదిక స్పందనలో వచ్చిన అర్జీలను వివిధ శాఖల అధికారులు పరిశీలించి అర్జీదారునికి నిర్ణీత కాలవ్యవధిలో న్యాయం చేయాలని జెసి ఎన్.తేజ్ భరత్ అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి 155 అర్జీలను డిఆర్ఒ జి.నరసింహులుతో కలిసి జెసి స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు వివిధ సమస్యలపై సుదూర ప్రాంతాల నుంచి స్పందనలో ఇచ్చిన అర్జీదారుల సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత కాలంలోనే పరిష్కరించి అర్జీదారునికి న్యాయం చేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో అర్జీదారుని ఇంటి వద్ద ఫోటో తీసుకుని వాటి వివరాలు తీసుకొని అప్‌లోడ్ చేయాలన్నారు. స్పందనలో వచ్చిన అర్జీలను ఆయా శాఖల వారీగా అధికారులు పూర్తి స్థాయిలో పరిశీలించి క్షేత్రస్థాయిలో పరిశీలన అనంతరం అర్జీదారునికి పరిష్కార పత్రాన్ని అందించాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 468 అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిలో 25 ఫిర్యాదులు తిరిగి వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ జి.నరసింహులు, ఆర్‌డిఒ ఎ.చైత్రవర్షిణి, జిల్లా అధికారులు డిఎంహెచ్ఒ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, డిసిహెచ్ డాక్టర్ ఎం.సనత్ కుమారి, సిపిఒ కె.ప్రకాష్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ డి.బాలశంకర్, డిపిఒ పి.జగదాంబ, డిఎస్ఒ పి.ప్రసాదరావు, జిల్లా హౌసింగ్ అధికారి బి.తారాచంద్, వ్యవసాయ శాఖ అధికారి మాధవరావు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న జెసి భరత్

వలస కార్మికులకు హక్కులపై అవగాహన

ప్రజాశక్తి-పెరవలి

డాన్ బాస్కో నవజీవన బాలభవన్ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యాన వలస కార్మికులు, వారి కుటుంబాల హక్కుల పరిరక్షణపై కడింపాడు, అన్నవరప్పాడు ఇటుక బట్టీల్లో సోమవారం నిర్వహించారు. ఉభయ గోదావరి జిల్లా క్లస్టర్ కో ఆర్డినేటర్ తేజకుమార్ పాల్గొన్నారు. పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఉన్నచోట ఉపాధి లేక పొట్ట కూటికోసం కడుపు చేత పట్టుకుని పని కోసం వేల కిలోమీటర్లు వచ్చిన వలస కార్మికుల కష్టాలను గుర్తించాలని అన్నారు. వారికి తగిన భద్రత, గౌరవం ఇవ్వాలని కోరారు. వారి జీవన విధానాన్ని ఇంకా మెరుగు పరిచే విధంగా తగు చర్యలు తీసుకోవాలని బట్టీల యాజమానులను కోరారు.

వాసు కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

తాడిపర్రుకు చెందిన అరిగెల వాసు ఇటీవల మరణించడంతో ఆయన కుటుంబాన్ని పార్టీ నిడదవోలు నియోజకవర్గ నాయకులు కుందుల వీర వెంకట సత్యనారాయణ సోమవారం పరామర్శించారు. వాసు తండ్రి అరిగెల వెంకటేశ్వరరావు, కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పలువురు తెలుగుదేశం కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - కొవ్వూరు రూరల్

మున్సిపాలిటీ పరిధిలో ప్రజల సమస్యలను పరిష్కరించాలని పట్టణ ప్రజల సంక్షేమ సంఘం నాయకులు సోమవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు పడాల గంగాధరరావు, దగ్గు రాధాకృష్ణ మాట్లాడుతూ పట్టణంలో ప్రధాన రహదారులు, వివిధ వార్డుల్లో రహదారులు గోతులు మయంగా ఉన్నాయని, పెరిగిన పట్టణ విస్తీర్ణానికి అనుగుణంగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి వీధి లైట్లు వెయ్యాలని, మంచినీటి సరఫరా మెరుగు పరచి, సక్రమంగా సరఫరా చేయాలని కోరారు. పారిశుధ్యం మెరుగు పరచాలని, పెరిగిన జనాభా, విస్తీర్ణానికి అనుగుణంగా అదనంగా పారిశుధ్య కార్మికులను, శానిటరీ ఇన్స్పెక్టర్‌ను నియమించాలని కోరారు. ఎప్పటికప్పుడు డ్రైనేజ్ లను శుభ్రపరచి దోమల నిర్మూలనకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. వీధి కుక్కల బారినుండి ప్రజలకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఎంతో కాలంగా పట్టణంలో ఈ సమస్యలు వేధిస్తున్నాయన్నారు.

పలుచోట్ల 'ఇదేం ఖర్మ రాష్ట్రానికి'

ప్రజాశక్తి-యంత్రాంగం

రాజమహేంద్రవరం అప్పులతో రాష్ట్రాన్ని నష్టపరుస్తున్న వైసిపిది మోసపూరిత ప్రభుత్వమని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ అన్నారు. స్థానిక 44వ డివిజన్‌లో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్ళి ప్రజలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గండేబత్తుల శ్యామ్, ధూళి రమేష్, వేములు రాజా, ఇంజరపు రాము, పాలవలస బ్రహ్మాజీ, మహేష్ తదితరులు **ఉండ్రాజవరం** వెలగదుర్రులో మాజీ ఎంఎల్ఎ బూరుగుపల్లి శేషారావు గడప గడపకు వెళ్లి, మహిళలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సింహాద్రి రామకృష్ణ, వేలివెన్ను ఉపసర్పంచ్ బూరుగుపల్లి శ్రీనివాస్, పాతూరి నరేంద్రబాబు, ముదునూరి రవీంద్రబాబు, రాచమల్ల శ్రీను, ఇందుకూరి దొరబాబు, దాసరి వెంకన్న, వీరమల్ల కృష్ణ, కుదప రమేష్, వేములు సత్యనారాయణ పాల్గొన్నారు.

పసివేదల రైల్వే గేట్ మూసివేత

ప్రజాశక్తి-కొవ్వూరు రూరల్

రైల్వే ట్రాక్ మరమ్మతుల కారణంగా పసివేదల రైల్వే స్టేషన్ వద్ద ఉన్న గేట్ మూసి వేస్తున్నట్టు సీనియర్ సెక్షన్ ఇంజినీర్ ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వే ట్రాక్ మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 7 గంటల నుండి 24వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు రైల్వే గేటు మూసిస్తామని సీనియర్ సెక్షన్ ఇంజినీర్ తెలిపారు. ఈ కారణంగా పసివేదల నుంచి వేములూరు, గౌరిపల్లి గ్రామాలకు రాకపోకలు ఉండవని ఆయన తెలిపారు.

కార్టూన్ 'నిజం'



ముందుగానే జగన్ పుట్టిన రోజు వేడుకలు

ప్రజాశక్తి-యంత్రాంగం

రాజమహేంద్రవరం సిఎం జగన్మోహన్ రెడ్డి పుట్టిన రోజు వేడుకను వైసిపి శ్రేణులు సోమవారం ఘనంగా నిర్వహించాయి. మధురపూడి విమానాశ్రయ ప్రాంగణంలో రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్, కాకినాడ ఎంపీ వంగా గీతా విశ్వనాథ్ కేక్ కట్ చేయించారు. **రాజమహేంద్రవరం రూరల్‌లో** పలు రకాల సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వైసిపి రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ తెలిపారు. 19న విద్యార్థులకు ఆటల పోటీలు, 21న మురమండలో జూనియర్ కాలేజీ విద్యార్థులకు ఉచితంగా యూనిఫారం పంపిణీ, మొక్కలు నాటే కార్యక్రమం, మహిళలకు ముగ్గుల పోటీలు, కేక్ కటింగ్ ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఖాదీబోర్డ్ వైస్ చైర్మన్ పిల్లి నిర్మలకుమారి, హితకారిణి సమాజం డైరెక్టర్ దేవులపల్లి సరితారాణి, మండపాక సరళ, ఊటుకూరి శైలజ, అంగాడ సత్య ప్రియ, పట్టపగలు వెంకటలక్ష్మి, పెన్నాడ లక్ష్మి, మార్గాని సుశీల, పెరుమాల లక్ష్మి సుజాత పాల్గొన్నారు. **దేవరపల్లి** రామన్నపాలెంలో సిఎం వైఎస్.జగన్ 50వ పుట్టినరోజు సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఈ కబడ్డీ పోటీల్లో రామన్నపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో, త్యాజంపూడి విద్యార్థులు రెండో స్థానంలో, దేవరపల్లి విద్యార్థులు మూడో స్థానం సాధించారు.

తరపట్ల ప్రదీప్ శాస్త్రికి ఎంఫిల్

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

విశాఖపట్నం, భీమునిపట్నం పరిసర ప్రాంతాల్లో ఉన్న సిల్లా, సెర్రెటా అనే మండ పీతలపై 'ఎ స్టడీస్ ఆఫ్ ద సీజనల్ బయో ఎక్యుమిలేషన్ ఆఫ్ హెవీ మెటల్స్ ఇన్ ఈస్ట్రియన్ క్రేబ్ సిల్లా సెర్రెటా' అనే అంశంమీద చేసిన పరిశోధనకు ఎంఫిల్ అందజేసినట్టు కాకినాడ ఐడియల్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ తరపట్ల ప్రదీప్‌శాస్త్రి తెలిపారు. నదులు, సముద్ర జలాల్లో వ్యర్థపదార్థాలను విరివిగా వదలడం వల్ల కాలుష్యం అధికంగా పెరిగి పెను ప్రమాదం ఏర్పడుతుందని, దానివల్ల ప్రజలకే కాకుండా జలచరాలకు ఎక్కువ నష్టం వాటిల్లి మృత్యువాత పడుతున్నాయని తెలిపారు. కాలుష్య నియంత్రణకు తగు చర్యలు తీసుకోవాలని తెలియజేస్తూ వివిధ విశ్వవిద్యాలయాల్లో అనేక పరిశోధనలు జరుగుతున్నాయని పరిశోధకుడు ప్రదీప్ శాస్త్రి తెలిపారు. ఆంధ్రా విశ్వవిద్యాలయం జంతుశాస్త్ర విభాగం నుంచి ప్రొఫెసర్ సి.మంజులత పర్యవేక్షణలో ఈ పరిశోధన చేసినట్టు తెలిపారు. ఆయన తండ్రి డాక్టర్ తరపట్ల సత్యనారాయణ నన్నయ విశ్వ విద్యాలయంలో తెలుగుశాఖా చార్యులుగా పని చేయడం విశేషం. ప్రదీప్ పరిశోధనకు ఎయు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.కృష్ణమోహన్ ఎం.ఫిల్ అవార్డును అందజేశారు.



ఎంఫిల్ అందుకుంటున్న ప్రదీప్ శాస్త్రి



ప్రచార ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ కతికా శుక్లా, జెసి ఇలాక్కియా, జిల్లా అధికారులు

గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ ప్రచార ఫ్లెక్సీ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కాకినాడ

రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించాలనే లక్ష్యంతో 2023, మార్చి 3, 4 తేదీలలో విశాఖపట్నంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్-2023కు సంబంధించిన ప్రచార ఫ్లెక్సీని సోమ వారం కలెక్టరేట్ స్పందనహాల్‌లో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, జెసి ఎస్.ఇలక్కియ, డిఆర్‌ఒ కె.శ్రీధర్‌రెడ్డి, జడ్‌పి సిఇఒ ఎన్‌వివి సత్య నారా యణ తదితరులు ఆవిష్కరించారు.

23న మంత్రి జోగి రమేష్ రాక

- 21న పండూరులో సామూహిక శంకుస్థాపనలు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ సిటీ నియోజకవర్గ గహ నిర్మాణ లబ్ధిదారులకు కేటాయించిన కొమరిగిరి లేఔట్ ప్రగతిని పరిశీలించేందుకు గహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ ఈనెల 23వ తేదీన ఇక్కడకు రానున్నారని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్ చెప్పారు. సోమవారం ఆయన కాకినాడ సిటీ నియోజకవర్గ గహనిర్మాణ ప్రగతిపై అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావుతో కలిసి ప్రత్యేకాధికారులు, గృహ నిర్మాణశాఖ, మెప్మా సిబ్బంది, కాంట్రాక్టర్లతో సమీక్షించారు. కొమరిగిరి లేఅవుట్‌లో. దాదాపు 8 నుంచి 9వేల మంది ఇళ్ల నిర్మాణానికి ఇప్పటికే ముందుకు వచ్చారన్నారు. ఇక్కడి నిర్మాణ ప్రగతిని పరిశీలించేందుకు మంత్రి పర్యటన ఖరారైందన్నారు. ఈ నెల 21వ తేదీన కాకినాడ రూరల్ నియోజకవర్గానికి సంబంధించి కార్పొరేషన్‌లోని 1,2,3, డివిజన్ల లబ్ధిదారులకు పండూరులో కేటాయించిన స్థలాల్లో సామూహిక శంకుస్థాపనలు జరుగుతాయన్నారు. గృహనిర్మాణ లబ్ధిదారులంతా స్వయం సహాయక సంఘాల సభ్యులుగా ఉండాలని కమిషనర్ కోరారు. వీరందరికీ రూ.35వేలు బ్యాంకు లింకేజీ కల్పిస్తున్నామని, ఆ సొమ్ముతో నిర్మాణాన్ని ప్రారంభించి అనంతరం ప్రభుత్వం ద్వారా సమకూరే రూ.1.80లక్షలతో నిర్మాణాన్ని వేగవంతం చేసుకోవాలన్నారు.

తప్పుడు రాతలపై జమ్మలమడక ఆగ్రహం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

రాష్ట్రంలో ముఖ్యమంత్రి చేస్తున్న సంక్షేమం, అభివద్ధిపై బురద జల్లటమే పనిగా చంద్రబాబు, తన అనుకూల మీడియాతో తప్పుడు రాతలు రాయిస్తున్నారని రాష్ట్ర వైసిపి మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి జమ్మలమడక నాగమణి ఆగ్రహం వ్యక్తం చేశారు. నిషేధిత భూములంటే ప్రభుత్వ భూములనీ, వాటిపై సంరక్షణ, వాటి ద్వారా అభివృద్ధి కూడా చేయటం ప్రభుత్వ విధానాలలో భాగమన్నారు. రాష్ట్రానికి చెందిన భూములు తాకట్టు పెట్టి పోర్టులు అభివృద్ధి చేయటంలో వీరికి కనబడ్డ తప్పు ఏమిటో అర్థం కావడం లేదన్నారు. గతంలో చంద్రబాబు మాదిరిగా రాజధాని నిర్మాణం అంటూ ముప్పై మూడు వేల ఎకరాలు ప్రైవేట్ భూమిని సేకరించి రైతులకు కేవలం బాండ్లు ఇచ్చి సదరు భూములపై వేల కోట్ల రూపాయలు అప్పులు చేసి నేటి వరకు లెక్కలు చెప్పలేని చంద్రబాబు నేడు జగన్ పై బురద జల్లే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. నాడు చంద్రబాబు చేసిన వేల కోట్ల భూముల అవినీతిపై ఏనాడూ రాయలేదనీ, ఇక్కడ చంద్రబాబు రాయిస్తే మాత్రమే కథనాలు వల్లె వేస్తున్నారన్నారు. ఆరోపణలు, తప్పుడు కథనాలు వలన ప్రయోజనం లేదన్నది ప్రజలు అంతా చూస్తున్నారని ఆమె హితవు పలికారు.

అంబేద్కర్ విగ్రహ సమస్య పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - తాళ్లరేవు

తాళ్ళరేవు మండలం సుంకరపాలెం పంచాయతీ సాయి చంద్ర కాలనీలో అంబేద్కర్ విగ్రహాన్ని యథాస్థానంలో ప్రతిష్టించాలని కాలనీవాసులు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చేస్తున్న రిలే దీక్షలపై అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకులు అధికారులతో తహశీల్దార్ కార్యాలయంలో తాళ్ళరేవు తహశీల్దార్ పోతురాజు ఆధ్వర్యంలో సోమవారం ఆందోళనకారులతో అధికారులు చర్చలు జరిపారు. అనంతరం తహశీల్దార్ విలేకరులతో మాట్లాడారు. సుంకరపాలెం పంచాయతీ మాగాపు సుగుణవతి కి చెందిన ఓనర్ షిప్ పట్ట స్థలంలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేశారని, అయినప్పటికీ ఆ స్థలం విగ్రహానికి కేటాయించి పట్టాదారులకు సామాజిక స్థలంలో వేరొక చోట పట్టా ఇవ్వడానికి ఆందోళనకారులతో చర్చించినట్లు తెలిపారు. అయితే సామాజిక స్థలంలో పట్టా ఇవ్వడానికి ఆందోళనకారులు అంగీకరించలేదని, సమస్యను పరిష్కరించడానికి తీవ్ర ప్రయత్నం చేస్తున్నా మని తెలిపారు. ఈ చర్చల్లో ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు, సుంకరపాలెం సర్పంచ్ టిల్లపూడి నాగేశ్వరరావు, సాయి చంద్ర కాలనీ నాయకులు, కాకినాడ రూరల్ సీ.ఐ. శ్రీనివాస్, కోరంగి ఎస్ఐ శ్రీనివాస్ కుమార్, పంచాయతీ కార్యదర్శి వరలక్ష్మి పాల్గొన్నారు.


ఎంఎల్‌ఎను కలిసిన జడ్‌పి హైస్కూల్ పూర్వ విద్యార్థులు

మా ఆట స్థలం మాకు ఇప్పించండి

- ఎంఎల్‌ఎకు విద్యార్థుల వినతి

ప్రజాశక్తి -యు. కొత్తపల్లి

సోమవారం పలు కార్యక్రమాలకు ఉప్పాడ విచ్చేసిన ఎంఎల్ఎ పెండెం దొరబాబును స్థానిక జడ్‌పి హైస్కూల్ వద్ద నిలుపుదల చేసి హెూటల్ మేనేజ్‌మెంట్ కళాశాల పేరుతో పాఠశాల ఆట స్థలంలో ఎటువంటి నిర్మా ణాలు చేపట్టవద్దంటూ విద్యార్థులు, పూర్వ విద్యార్థులు వినతి పత్రం అందజేసి కోరారు. దీనిపై స్పందించిన ఎంఎల్ఎ సంబంధిత అధికారులతో మాట్లాడి పాఠశాల ఆట స్థలంలో ఎటువంటి నిర్మాణాలు చేపట్ట వద్దంటూ అధికారులకు తెలిపారు. ఎంఎల్‌ఎను కలిసిన వారిలో వైస్ ఎంపీపీ మాదిరెడ్డి దొరబాబు, ఉప్పాడ సర్పంచ్ ఉమ్మిడి మేరీ జాన్, నక్కా మణికంఠ, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక కృషి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

నియోజకవర్గంలో మౌలిక వసతులు కల్పనకు ప్రత్యేక కృషి చేస్తున్నట్లు ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. ఏలేశ్వరం మెయిన్ రోడ్డుకు ఇరువైపులా నూతనంగా రూ.రెండు కోట్లతో నిర్మించనున్న మాస్టర్ డ్రెయిన్ పనులకు ఆయన సోమవారం శంకుస్థాపన చేశారు.కార్యక్రమంలో చైర్ పర్సన్ అలమండ సత్యవతి, జడ్‌పిటిసి మాజీ సభ్యుడు శిడగం వెంకటేశ్వరరావు, వార్డు కౌన్సిలర్లు బదిరెడ్డి గోవిందబాబు, బొదిరెడ్డి గోపి, తొండారపు రాంబాబు, సామంతుల సూర్య కుమార్, సుంకర రాంబాబు, యండగుండి నాగబాబు, కోనాల వెంకటరమణ, కమిషనర్ కె.శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

డ్రెయినేజీల్లో చెత్త వేయొద్దు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

పారిశుధ్య పనుల తనిఖీల్లో భాగంగా సోమవారం ఎడిసి సిహెచ్ నాగనరసింహారావు 9వ సర్కిల్‌లోని సాంబమూర్తి నగర్ 2,3 వీధులలో పర్యటించారు. చెత్తను రోడ్ల పైనా, డ్రెయిన్లలోను వేయవద్దని కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఏడీసీ మాట్లాడుతూ ఇళ్లల్లోని చెత్తను రోడ్లు, డ్రెయిన్లలో వేయకుండా శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, పారిశుధ్య కార్యదర్శులు, వాలంటీర్లు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. నగరపాలకసంస్థ అందిస్తోన్న మెరుగైన సేవలను దృష్టిలో ఉంచుకుని ప్రతీ ఇంటి యజమాని నిర్దేశించిన యూజర్‌చార్జీని చెల్లించాలని ఏడీసీ కోరారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ కుడుపూడి సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

కాకినాడ వైసిపి కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ సిటీ వైసిపి కార్యాలయాన్ని కాకినాడ ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి ప్రారంభించారు.ఇప్పటి వరకు బాలా త్రిపుర సుందరి ఆలయ సమీపంలో ఉన్న భవనంలో కాకినాడ సిటీ నియోజకవర్గ సంబంధిత కార్యకలాపాల మాత్రమే నిర్వహించేవారమని తాజాగా వైసిపి కార్యవర్గ నియామకం సందర్భంగా నగర అధ్యక్షురాలుగా మాజీ మేయర్ సుంకర శివ ప్రసన్న నియామకంతో ఈ కార్యాలయం లో ఉన్న రెండూ అంతస్తులు సిటీ పార్టీకి కేటాయించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ద్వారంపూడి వీరభద్రరెడ్డి మాజీ మేయర్ సుంకర శివప్రసాన్నాసాగర్ దంపతులు మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు అనంతరం జనసేన పార్టీ నుండి వైకాపా గూటికి చేరిన కృష్ణ ప్రియకు ద్వారంపూడి వైసిపి కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.

ట్రాఫిక్ కోన్ ఎగిరిపడి.. ఢీకొన్న కారులు

హైవే సిబ్బంది పర్యవేక్షణా లోపం వల్ల ప్రమాదాలు

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లి హైవైలో ప్రతిరోజు ఏదో ఒక చోట రోడ్డు పనులు చేస్తున్నారంటూ, రహదారిపై వాహనదారులకు ఇండికేటర్లుగా పెడుతున్న ప్లాస్టిక్ ట్రాఫిక్ కోన్‌లు ఏర్పాటుచేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ అంతరాయంతో పాటు, పలు ప్రమాదాలు జరిగి ఎంతోమంది క్షతగాత్రులయి ఆస్పత్రుల పాలవుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం గండేపల్లి మండలం మల్లేపల్లి గ్రామ శివారు జాతీయ రహదారిపై పెట్టిన ట్రాఫిక్ కోన్‌ల వల్ల ప్రమాదం జరిగింది.

స్థానికుల తెలిపిన వివరాలు మేరకు రోడ్డుపై పెట్టిన ప్లాస్టిక్ ట్రాఫిక్ కోన్ బరువులేక పోవడంతో ఒక్కసారిగా గాలిలోకి ఎగిరి రోడ్డుకు అడ్డంగా పడడంతో... రాజమండ్రి వైపు వెళుతున్న కారు సడన్ బ్రేక్ వేయడంతో వెనుక నుంచి వస్తున్న మూడు కార్లు ఒకదానికి ఒకటి వెనుక నుంచి ఢీకొన్నాయి. అయితే డ్రైవర్ కారును వెంటనే అదుపు చేయడంతో కారులో ఉన్నవారికి స్వల్ప గాయాలతో పెను ప్రమాదం తప్పింది. లేక పోయిన ట్లయితే ప్రాణనష్టం జరిగేదని స్థానికులు, వాహనదారులు తెలిపారు. జాతీయ రహదారిపై ప్రతిరోజు ఏదో ఒకచోట జాతీయ రహదారిపై మరమ్మ తుల పేరుతో కిలో మీటరు మేర రోడ్డు మధ్యలో గాలికి నిలువలేని ట్రాఫిక్ కోన్‌లను ఏర్పాటు చేస్తున్నారు. అయితే హైవే అధికారుల పర్య వేక్షణాలోపం వల్ల ఇటువంటి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా యని వాహన దారులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు ట్రాఫిక్ కోన్‌ల ఏర్పాటులో గాలికి తట్టుకుని నిలబడేలా తగు చర్యలు తీసుకుని, పనిచేసే ప్రదేశం మేర మాత్రమే ఏర్పాటు చేసి ప్రమాదాలకు తావివ్వకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



ప్రమాదానికి గురైన కారు


బంగారు కృష్ణ పరామర్శిస్తున్న సుభాష్ చంద్రబోస్,దొరబాబు

బంగారు కృష్ణకు బోస్,దొరబాబుల పరామర్శ

ప్రజాశక్తి - పెద్దాపురం

ఇటీవల అనారోగ్యానికి గురై కోలుకున్న పెద్దాపురం మాజీ జడ్పిటిసి బంగారు కష్ణను జీ.రాగంపేటలోని ఆయన స్వగహంలో సోమవారం ఉభయ గోదావరి జిల్లాల రీజియన్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబులు పరామర్శించారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి గవరసాన సూరిబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, ఏఎంసీ వైస్ చైర్మన్ బండారు వీరబాబు, మున్సిపల్ కౌన్సిలర్ ఆరేళ్ల వీర రాఘవ,సంతోష్ రాజు,పలువురు ప్రజా ప్రతినిధులు,వైసిపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

విధులు నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కాకినాడ జిల్లా పోలీస్ కానిస్టేబుల్ ఎం.సతీష్‌కుమార్ సతీ మణికి సోమవారం జిల్లా ఎస్పి ఎం.రవీంద్రనాథ్ బాబు రూ.21,15,000 గ్రూప్ పర్సనల్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ చెక్కు ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ బాధిత కుటుంబానికి ప్రభుత్వ పరంగా అందజేయవలసిన అన్ని సదుపాయాలు అందేలా కృషి చేస్తామని, ఏ విధమైన సహాయం కావలసి ఉన్న పోలీస్ అధికారులుగా తెలియచేస్తే సమస్య పరి ష్కారానికి కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. ఆయనతో పాటు అడిషనల్ ఎస్.పి. (అడ్మిన్) పి. శ్రీనివాస్ ఇతర అధికారులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

తాళ్ళరేవు మండలం జై భీమ్ పేట సమీపంలో జాతీయ రహదారి 216 పై జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురుకి తీవ్ర గాయాలయ్యాయి. కోరంగి ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు ద్విచక్ర వాహనంపై గన్నవరం వెళుతుండగా యానం నుంచి కాకినాడ ద్విచక్ర వాహనంపై వెళుతున్న యువకులు రాంగ్ రూట్లో వచ్చి ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగినట్లు కోరంగి పోలీసులు తెలిపారు. ప్రమాదంలో ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన కోటి రామప్రసాద్, మోర్త రాము, ఇందుర్తి హర్షవర్ధన్‌లకు, కాకినాడ వైపు వెళుతున్న సంతోష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు స్థానికుల సహా యంతో వారిని 108లో కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. కోరంగి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జె-ట్యాక్స్‌తో ప్రజల శ్రమ దోపిడీ

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

జె-టాక్స్‌లతో రాష్ట్ర ప్రజల శ్రమను వైసిపి ప్రభుత్వం జగన్ రెడ్డి దోచుకుం టున్నారని కాకినాడ సిటీ వనమాడి కొండబాబు విమర్శించారు. ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా సోమవారం 9వ డివిజన్‌లో పర్యటించి వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై స్థానిక ప్రజలకు కరపత్రాన్ని అందించి ధరలతో ప్రజలు, వ్యాపారస్తులు కుదేలయ్యారని, రాష్ట్రంలో ఏమి కొనాలన్నా, ఏ వ్యాపారం చేయాలన్న ముందు జె-టాక్స్ కట్టవలసిన పరిస్థితి దాపురించిందని, దాని వల్ల వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని వివరించారు. కార్యక్ర మంలో వాసంశెట్టి చిట్టప్ప, తంగినబోయిన రాముడు, వడ్డకాసుల దోనాద్రి అబ్రహం, సీకోటి అప్పలకొండ, అంబటి చిన్న, వానపల్లి పోలీస్, రాయుడు సింహాచలం, అనుసూరి సుబ్బారావు, అనసూరి చిన్న, సత్తిబాబు, గుబ్బల దుర్గారావు, మళ్లీ రాజు, కట్టా సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భవిత సెంటర్‌లో అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి- రౌతులపూడి

రౌతులపూడిలో భవిత సెంటర్‌ను సిఎంఒ, ఐఇ కోఆర్డినేటర్ చామంతి నాగేశ్వరరావు సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అనంతరం జడ్‌పి ఉన్నత పాఠశాలను పరిశీలించారు మండల వనరుల కేంద్రంలో జగనన్న విద్యా కానుక కిట్లు విద్యాశాఖ రికార్డులను పరిశీలించి, సంతప్తి వక్తం చేశారు.

నేరాలు ఘోరాలు

ప్రియునిపై బ్లేడుతో దాడి

రాజోలు : ప్రియునిపై బ్లేడుతో వివా హిత దాడి చేసిన సంఘటన తాటిపాకలో ఆలస్యంగా వెలుగు చూసింది. మలికి పురం మండలం గూడపల్లికి చెందిన కటికిరెడ్డి కృష్ణగణేష్ తాటిపాక చెందిన వివాహితతో కొంతకాలంగా వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ నెల 17న రాత్రి సమయంలో భర్త ఇంటి వద్ద లేకపోవడంతో ప్రియుడు కృష్ణను ఇంటికి పిలిపించింది. తనతోనే కాక మరికొంత మంది మహిళలతో సంబంధం ఉందనే అనుమానంతో కృష్ణతో గొడవకు దిగింది. బ్లేడుతో కష్ణ మర్మాంగాన్ని కోసేసింది. బాధితుడు ప్రస్తుతం అమలాపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుని ఫిర్యాదుతో రాజోలు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితురాలిపై 326 సెక్షన్ కింద కేసు నమోదు చేశామని ఎస్ఐ గణేశ్వరరావు తెలిపారు.

ట్రాక్టర్ తిరగబడి డ్రైవర్ మృతి

కాట్రేనికోన : కాట్రేనికోన పంచాయతీ పరిధిలోని వెంకమ్మ చెరువు సమీపంలో సోమవారం వరి చేలో దమ్ము చేస్తుండగా ట్రాక్టర్ తిరగబడి ఉప్పుడికి చెందిన డ్రైవర్ రంబాల సురేష్ (22) మృతి చెందాడు. ట్రాక్టర్ తిరగబడి దాని కింద సురేష్ ఇరుక్కుపోవడంతో స్థానికులు జెసిబి రప్పించి ట్రాక్టర్‌ను పక్కకు తొలగించారు. అయితే అప్పటికే ఊపిరి ఆడక పోవడంతో సురేష్ మతి చెందినట్లు స్థానికులు చెబుతున్నారు.

25 కేజీల గంజాయి స్వాధీనం

ధవళేశ్వరం : 25 కేజీల గంజాయిని ధవళేశ్వరం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బాయ్స్ హైస్కూల్ దగ్గర ఉన్న పాత ఇంటిలో 25 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురు నిందితులను అరెస్టు చేసినట్టు ఎస్ఐ కేశవరావు తెలిపారు.

నగదు, బంగారం చోరీ

ప్రజాశక్తి-ఐ.పోలవరం

మహిళపై దాడి చేసి నగదు, బంగారం చోరీ చేసిన సంఘటన సోమవారం కొమరగిరిలో చోటు చేసుకుంది. కొమరగిరి పంచాయతీ పరిధిలోనితాటాకింటిలో ఒంటరిగా జీవిస్తున్న గాది మంగాదేవిపై ఆదివారం రాత్రి ఒంటి గంట సమయంలో ఒక వ్యక్తి దాడి చేశారు. ఆమెను తీవ్రంగా గాయపర్చి బీరువాలో ఉన్న రూ.15 వేలు నగదు, బంగారం అపహరించుకు పోయాడు. ఉదయాన్నే ఆమె మేనల్లుడు ఆకుల శ్రీను ఆమె ఇంటికి వచ్చే సరికి గాయాలతో ఉండటంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి - ఉంద్రాజవరం

పాఠశాల స్థాయిలో విద్యార్థులు క్రీడలలో పతకాలను సాధిస్తూ మరింత కషితో ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు సూచించారు. బుధవారం సిఎం జగన్ పుట్టినరోజును పురస్కరించుకుని సోమవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన క్రీడలల్లో విజేతలకు ఆయన బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మెండే వెంకట్రావు, వైస్ ఎంపిపి నరహరిశెట్టి సరోజ, పంచాయితీ వార్డు సభ్యులు పేరెంట్స్ కమిటీ చైర్మన్ కరెళ్ల సోమేశ్వరరావు, నాయకులు దొనేపూడి సుధాకర్, పాఠశాల హెచ్ఎం విశ్వప్రసాద్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు బడ్జెట్ అంచనాలు

ప్రజాశక్తి - సీతానగరం

సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ రమేష్ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గుర్రాల జ్యోత్స్న అధ్యక్షతన అభివృద్ధి పనులకు సంబంధించి ప్రజాధనం సమర్థ వినియోగానికి 2022-2023 సంవత్సరానికి బడ్జెట్ అంచనాలు, 2023-2024 సంవత్సరానికి సవరించిన బడ్జెట్ అంచనాలు ప్రవేశపెట్టారు. పంచాయతీరాజ్ సంస్థల్లో నూతన నియమాలు అనుసరించి రెవిన్యూ, క్యాపిటల్ రాబడులు, అప్పులు, అడ్వాన్స్ లు, వ్యయాలకు సంబంధించిన లెక్కలు, వ్యయ రాబడులకు సంబంధించి డిపాజిట్లు, సివిల్ అడ్వాన్స్‌లు, వార్షిక రాబడుల ప్రకారం అన్ని పద్దులూ కలిపి రూ.13.79 కోట్ల అంచనా వ్యయం చూపారు.

సిఐటియు మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - ఉంద్రాజవరం

రాష్ట్రంలో కనీస వేతనాల బోర్డును వెంటనే ప్రభుత్వం ఏర్పాటు చేయాలని సిఐటియు జిల్లా నాయకులు కె.సుందర బాబు డిమాండ్ చేశారు. సోమవారం సిఐటియు మండల మహాసభలో ఆయన మాట్లాడారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలన్నారు. అనంతరం సిఐటియు మండలం కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా వీరవల్లి వెంకట సుబ్బారావు, కార్యదర్శిగా అబ్బు వెంకటేశ్వరరావు, ఎస్.రంగనాయకమ్మ, మానే జానకి, కె.త్యాగలక్ష్మి, పి.విజయలక్ష్మి, ఇర్రి సుబ్బారావు, మారిశెట్టి నాగేశ్వరరావు, ఎస్‌కె.వలి కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి తూరుగోపు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో పండ్లు పంపిణీ

ప్రజాశక్తి-పెరవలి

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా మూడు రోజుల కార్యక్రమాల్లో భాగంగా సోమవారం స్థానిక పిహెచ్‌సిలోని గర్భిణులు, రోగులకు ఎంపిపి కె.సీతారామ్ ప్రసాద్ ఆధ్వర్యాన పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు వీరమల్లు సత్యనారాయణ, పంపన అంజి, సన్నీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

ప్రజాశక్తి-గోపాలపురం

సంక్షేమ పథకాలు అమలు చేస్తూ, గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని ఎంపిపి ఉండవల్లి సత్యనారాయణ, సొసైటీ అధ్యక్షులు కూసం రామ్మోహన్ రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక పెద్దగూడెంలో రూ.10 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ పైడి శిరీష ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇచ్చిన హామీల ప్రకారం రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు ప్రజలకు అందిస్తూ ప్రజల సౌలభ్యం కోసం గ్రామస్థాయిలోనే పరిపాలన అభివృద్ధి చేసేందుకు సచివాలయ వ్యవస్థ ఏర్పాటు ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. వాలంటీర్ల, సచివాలయ సిబ్బంది ద్వారా ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం అందించే అన్ని రకాల పనులు గ్రామస్థాయిలోనే అమలు జరగడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ సర్పంచ్ ముల్లంగి శ్యామ్ సుందర్ రెడ్డి, వైస్ ఎంపిపి వెంకటేశ్వరమ్మ, వింత ప్రసాద్‌రెడ్డి, దాసరి కుటుంబరావు, ఎంపిటిసి వార సంగీత, రాష్ట్ర స్పోర్ట్స్ డైరెక్టర్ కప్పల వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలపై నిరసన

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలంలోని మర్లపాలెంలో ఇసుక అక్రమ తవ్వకాలను అరికట్టాలని సర్పంచ్ శ్రీరామచంద్రమూర్తి మండల సమావేశంలో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. సోమవారం ఆత్రేయపురం మండల పరిషత్ సమావేశం ఎంపిపి కుండా అన్నపూర్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఎంపిడిఒ నాతి బుజ్జి 2023-24 సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు మండలంలో విద్యుత్ సమస్యలను అధికారులు పట్టించుకోవట్లేదన్నారు. తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందించట్లేదని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు మాట్లాడుతూ గోదావరి వరదలకు పులిదిండి గ్రామ పరిధిలో 200 ఎకరాల వరకు పంట పొలాలు నదిలో కలిసిపోయాయన్నారు. ఎన్నిసార్లు అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. ఈ సమావేశంలో జడ్‌పిటిసి సభ్యులు బోనం సాయిబాబా, ఎంపిడిఒ నాతి బుజ్జి, తహశీల్దార్ డివిఎస్.అరుణ్‌కుమార్, వివిధ గ్రామాల సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

కార్పొరేషన్‌లో 23 అర్జీల స్వీకరణ

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

స్పందన సందర్భంగా సోమవారం 23 అర్జీలు ప్రజల నుంచి వచ్చాయని మున్సిపల్ కమిషనర్ కె.దినేష్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో అదనపు డిప్యూటీ కమిషనర్ పిఎం సత్యవేణి, సిపి జె.సూరజ్‌కుమార్, ఎస్ఇ జి.పాండురంగారావు, ఇతర అధికారులు, సచివాలయ సిబ్బందితో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం కమిషనర్ కె.దినేష్ కుమార్ అధికారులు సచివాలయ సిబ్బందితో సమీక్ష చేశారు. ఆయుష్మాన్ భవ డిజిటలైజేషన్, ప్రణాళిక విభాగం మార్గదర్శకాల అమలులో నూరు శాతం లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు అన్నారు. అంగరలో సోమవారం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటా పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. గ్రామంలో మహిళలు హారతులతో ఎంఎల్‌సికి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు ఎం.సత్యవేణి, జడ్‌పిటిసి పి.వీరవెంకట సూర్యనారాయణ, సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, పాల్గొన్నారు.

ప్రజలకు చేరువగా 'ఫ్యామిలీ ఫిజీషియన్'

అమలాపురం రూరల్ : ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ప్రజలకు మరింత చేరువ చేయాలని ఆసుత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ కుడుపూడి భాగ్యలక్ష్మి అన్నారు. పేరూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యులు పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, ఆసుపత్రి అభివద్ధి కమిటీ సభ్యులు కామనగరువు గ్రామ సర్పంచ్ నక్క అరుణకుమారి, ఎంపిడిఒ కెవి. ప్రసాద్, వైద్యాధికారులు ఎం.శాంతిలక్ష్మి, వెన్నెల సాహితి పాల్గొన్నారు.

కుట్టు మిషన్ కేంద్రం ప్రారంభం

మండపేట : స్థానిక 27వ వార్డు మసీదులో జమతే ఇస్లామి హింద్ మహిళా విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు మిషన్ కేంద్రాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడారు. మహిళలకు, యువతులకు ఉచితంగా కుట్టులో శిక్షణ ఇస్తారన్నారు. ఇది మహిళల ఆర్థిక పురోగతికి దోహద పడుతుందన్నారు. కరోన సమయంలో జమతే ఇస్లామి హింద్ విభాగం వారు చేసిన సేవ కార్యక్రమాలు ప్రసంశనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు అమలదాసు లక్ష్మీ ,నీలం దుర్గ, జమతే ఇస్లామి హింద్ మహిళా విభాగం సభ్యులు,సానిటరీ ఇన్స్పెక్టర్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ పనుల పరిశీలన

రాజమహేంద్రవరం : ప్రజలు సమస్యలను పరిష్కరించడమే టిడిపి ధ్యేయమని రాజమహేంద్రవరం సిటీ ఎంఎల్ఎ ఆదిరెడ్డి భవాని శ్రీనివాస్ అన్నారు. స్థానిక 36వ డివిజన్ రామచంద్రరావు పేటలోని చెరుకూరి స్వర్ణాంజలి రోడ్డులో జరుగుతున్న కల్వర్టు అభివృద్ధి పనులను టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్, స్థానిక పార్టీ నాయకులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగర పాలక సంస్థ గత పాలక మండలి తీర్మానం చేయగా ఇప్పటికి ఈ డ్రైనేజీ నిర్మాణం చేపట్టారన్నారు. టిడిపి ప్రభుత్వ హయాంలో తప్పితే జగన్ పాలనలో అభివృద్ధి శూన్యమన్నారు.